

PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మండే జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

సోమవారం 09 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 159 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి విస్తృత పర్యటన: పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం





హైదరాబాద్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): దీపావళి పండుగతో పాటు తన జన్మదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో ఆదివారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. దుద్యాల మండలం హకీంపేట్‌లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, నాట్కో (NATCO) ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనాలను సీఎం ప్రారంభించారు. అనంతరం దుద్యాల మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనంతో పాటు కొడంగల్ పట్టణంలో కొత్తగా నిర్మించిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాలను ప్రారంభించి, ప్రాంగణంలో మొక్కను నాటారు. అలాగే దౌల్తాబాద్ కేంద్రంలో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కాలేజీని కూడా ప్రారంభించి స్థానిక ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు.పర్యటనలో భాగంగా కొడంగల్ మండలం పర్సాపూర్ గ్రామంలో గోరిపల్లి సుమిత్ర, శ్రీనివాస్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి, వారితో కలిసి "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" వేడుక జరుపుకున్నారు. ఈ సందర్భంగా దంపతులకు నూతన వస్త్రాలు బహూకరించి, వారి ఇంట్లోనే సన్నబియ్యం భోజనాన్ని స్వీకరించారు. అనంతరం అక్కడి పిల్లలకు పెన్నులు బహూకరించి వారితో కలిసి టపాసులు కాల్చి సందడి చేశారు. ఈ అన్ని కార్యక్రమాల్లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.







సీఎం రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి రాష్ట్ర నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు నలమాద పద్మావతి రెడ్డి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని వారు ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేయాలని, వారి నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే తన జీవిత లక్ష్యం

సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆడపిల్లలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే విద్య ఎంతో అవసరమని, ప్రతి తల్లి తన పిల్లలను తప్పనిసరిగా చదివిస్తానని సంకల్పం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 2034 నాటికి తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే తన జీవిత లక్ష్యమని ప్రకటిస్తూ, దీపావళి పండుగతో పాటు తన జన్మదినాన్ని పురస్కరించుకుని కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేట్ ఇండస్ట్రియల్ హబ్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, నేత, గీత కార్మికులకు కొత్తగా మంజూరైన 4.5 లక్షల పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి పలువురు మహిళలకు స్వయంగా పింఛన్లు అందజేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ మహిళల ఆనందంలో భాగస్వామిగా, ఒక సోదరుడిగా సేవ చేసే అవకాశం భగవంతుడు కల్పించారని, తన పుట్టినరోజును మహిళా శక్తికి అంకితం చేస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 70 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని, 2034 నాటికి ఈ సంఖ్యను కోటికి పెంచి వారందరినీ ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దాలన్నదే తన సంకల్పమని వెల్లడించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 25.5 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున స్కూల్ యూనిఫాంలు కుట్టే బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించామని, పెట్రోల్ బంకుల నిర్వహణ, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, ఇందిరమ్మ క్యాంటీన్ల నిర్వహణలోనూ అవకాశాలు కల్పించామని వివరించారు. గత 34 నెలల్లో మహిళా సంఘాలకు రూ.79 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని, వాటిపై ప్రభుత్వం రూ.1,900 కోట్ల మేర వడ్డీ చెల్లించిందని వెల్లడించారు. మంజూరు చేసిన 8.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేర్లతోనే అందిస్తున్నామని, మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో వారు నెలకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ప్రయాణ ఖర్చులు ఆదా చేసుకుంటున్నారని, దీనికి గాను ప్రభుత్వం ఆర్టీసీకి రూ.13 వేల కోట్లు చెల్లించిందని పేర్కొన్నారు. నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు సారెగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలంటే మహిళలు వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించిన ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి అనసూయ సీతక్క, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సూర్యాపేట కాంగ్రెస్ కంచుకోట, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం: మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



సూర్యాపేట, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మనమందరం కాంగ్రెస్ పార్టీ అనే ఒకే కుటుంబ సభ్యులమని, ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని కంచుకోట అని పేర్కొన్న అయన, తుంగతుర్తి నియోజకవర్గంతో పాటు జిల్లా సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం మరియు పార్టీ శ్రేణులు కలిసికట్టుగా కృషి చేస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే నిజమైన బలమని, వారి కష్టమే పార్టీకి పునాది అని కొనియాడిన మంత్రి, ప్రతి ఒక్క కార్యకర్తకు సముచిత న్యాయం, తగిన గుర్తింపు కల్పించే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. స్వర్గీయ దామోదర్ రెడ్డి గారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉందని గుర్తుచేస్తూ, గతంలో రఘువీర్ రెడ్డిని ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించిన తరహాలోనే, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ్ రెడ్డిని కూడా అత్యధిక మెజారిటీతో విజయం సాధింపజేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



మంత్రి నలమాధ ఉత్తంకుమార్ రెడ్డి

తెలంగాణ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

హుజూర్ నగర్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): చీకటిని పారద్రోలి వెలుగులు నింపే దివ్యమైన దీపావళి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి మరియు హుజూర్ నగర్ శాసనసభ్యులు కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపాల కాంతుల వలె ప్రతి ఇంటా ఆనందపు వెలుగులు నిండాలని, నరకాసుర వధతో దీపావళి జరుపుకున్నట్లే తెలంగాణ రాష్ట్రంలోనూ చీకట్లు తొలగి మళ్లీ అభివృద్ధి వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. అగ్ని కొలువైన దీపాల వెలుగులు మనలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి, చైతన్యాన్ని రగిలించి ప్రగతి సాధనలో నూతనోత్తేజంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. పవిత్రమైన కార్తీక మాసంలో నిర్వహించే పూజల ఫలితంగా ప్రజలందరికీ శుభాలు కలగాలని కోరుకున్న మంత్రి, పండుగ వేళ బాణాసంచా పేల్చే సమయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



మాజీ మంత్రి హరీశ్ రావును మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తన్నీరు హరీశ్ రావును సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. దీపావళి పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌తో పాటు మాజీ డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, నాయకులు జైపాల్ రెడ్డి, మల్లేశంలు హరీశ్ రావుకు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజలందరి జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి మరియు శ్రేయస్సు వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు.




భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

హైదరాబాద్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ చారిత్రక శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆల సందర్శన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అర్చకుల నుంచి తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు మరియు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపి, ప్రజలలో సంతోషం, ఐక్యత మరియు సోదరభావాన్ని మరింత పెంపొందించాలని ఆకాంక్షిస్తూ సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జైపాల్ రెడ్డి, మల్లేశం, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల చిరునవ్వుల్లో దీపావళి వెలుగులు.. చిన్నారులతో సంబరాలు జరుపుకున్న మాద్రి పృథ్వీరాజ్



నవంబర్ 09 (పటాన్‌చెరు) : సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి సంగమేశ్వర్: పటాన్‌చెరు నియోజకవర్గం బొల్లారంలోని డిజైర్ సొసైటీలో MDR ఫౌండేషన్ కో-ఫౌండర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాద్రి పృథ్వీరాజ్ చిన్నారులతో కలిసి దీపావళి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. MDR ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఎనిమిదేళ్లుగా ప్రతి దీపావళి సందర్భంగా చిన్నారులకు ఆనందాన్ని పంచుతూ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది కూడా చిన్నారులకు పటాకులు పంపిణీ చేసి, వారితో కలిసి పటాకులు కాలుస్తూ పండుగ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ చిన్నారుల ముఖాల్లో కనిపించే చిరునవ్వుల కంటే విలువైనది మరొకటి లేదని, వారి ఆనందమే తనకు నిజమైన పండుగ అని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, ఆశ, వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. సమాజంలో ఆనందాన్ని పంచే ఇలాంటి సేవా కార్యక్రమాలను MDR ఫౌండేషన్ తరఫున నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. పటాకులు అందుకున్న చిన్నారులు ఆనందంతో థాంక్యూ అన్నయ్య, హ్యాపీ దీపావళి అంటూ తమ సంతోషాన్ని వ్యక్తం చేయగా, చిన్నారుల కేరింతలు, చిరునవ్వుల మధ్య వేడుకలు ఆహ్లాదకరంగా సాగాయి. పండుగల అసలైన స్ఫూర్తి ఆనందాన్ని పంచుకోవడమేనని చాటుతూ చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు నింపే లక్ష్యంతో MDR ఫౌండేషన్ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది.



పేదల ఇళ్లలో వెలుగులు నింపడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం: మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు

మెదక్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు వారి జీవితాల్లో సంతోషాలు నింపడమే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు స్పష్టం చేశారు. ఆదివారం 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా హవేలి ఘన్పూర్ మండలంలోని స్కూల్ తాండ, లింగసాన్ పల్లి తాండ, మెదక్ మండలంలోని శివాయపల్లి మరియు శంకరంపేట్ (ఆర్) మండలంలోని మిర్జాపల్లి తాండ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సొంతింటిలో పండుగ జరుపుకోవడం ప్రతి పేద కుటుంబానికి ఎంతో సంతోషకరమైన విషయమని, ప్రతి నిరుపేదకు గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్న ఆయన, ప్రజల ఆనందంలో భాగస్వామి కావడం తనకు ఎంతో తృప్తినిస్తుందని, మెదక్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే తన మొదటి ప్రాధాన్యత అని వెల్లడించారు.



పేదింట దీపావళి వెలుగులు నింపిన ఘనత కాంగ్రెస్ పార్టీదే: నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అత్యంత అభినందనీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ నీలం మధు ముదిరాజ్ కొనియాడారు. ఆదివారం దీపావళి సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తన స్వగ్రామం చిట్కుల్ నాలుగో వార్డులో గౌండ్ల నాగమణికి మంజూరైన ఇందిరమ్మ ఇంట్లో నిర్వహించిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సంబరాలు' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారు నాగమణి కుటుంబ సభ్యులతో కలిసి నూతన ఇంట్లో దీపాలు వెలిగించి టపాసులు కాల్చుతూ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబానికి నూతన వస్త్రాలు అందించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపిన నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, గతంలో సొంతింటి కల నెరవేరుతుందో లేదోనని ఆందోళన చెందిన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం నూతన ఆశలు కల్పించిందని, పేద కుటుంబం కొత్త ఇంట్లో దీపాలు వెలిగిస్తూ పండుగ జరుపుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. పేదల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఇళ్ల నిర్మాణాలకు కృషి చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయగా, ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్, కౌన్సిలర్లు నీలం కవిత ముదిరాజ్, సంగన్నగారి జ్యోతిగోపాల్, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు.. లబ్ధిదారుల కుటుంబంతో కలిసి పండుగ సంబరాలు



అందోల్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి) అందోల్ మండల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా, పేద కుటుంబాల ఇళ్లలో దీపావళి పండుగను జరుపుకోవాలన్న ప్రభుత్వ పిలుపు మేరకు అందోల్ మండలంలో ప్రత్యేకంగా దీపావళి వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు చెక్రాల పద్మమ్మ వెంకయ్య ఇందిరమ్మ ఇంట్లో సర్పంచ్ తెనుగు సునీత, మైపాల్ ఆధ్వర్యంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించి, కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అందోల్ మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీ. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం మాత్రమే కాదని, పేద కుటుంబాల ఎన్నో ఏళ్ల కలలకు సాకారమని, ఆత్మగౌరవంతో జీవించేందుకు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలను నింపుతోందన్నారు. పేదల ఇంటి ముంగిట దీపావళి వెలుగులు నింపుతూ, లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి పండుగ జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరి వెంకట్ రెడ్డి, సెక్రటరీ నాగరాజ్, ఈశ్వర్, బాలయ్య, రమేష్ గౌడ్, నాగభూషణం, నర్సిలు, మానయ్య, దుర్గయ్య, మల్లేశం, వీరేందర్, మహేందర్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఇంటా దీపావళి వెలుగులు నిండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

విభిన్న పాత్రలతో ఆకట్టుకుంటున్న గగన్ విహారి.. హీరోగా రాణించే సత్తా!



సందేశం టైమ్స్ ప్రత్యేక కథనం:నవంబర్ 9 తెలుగు సినీ పరిశ్రమలో నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు నిరంతరం కృషి చేస్తున్న నటుడు గగన్ విహారి. విభిన్నమైన పాత్రలు పోషిస్తూ తన నటనా ప్రతిభను చాటుకుంటున్న ఆయనకు హీరోగా రాణించే సత్తా ఉందని సినీ అభిమానులు, శ్రేయోభిలాషులు అభిప్రాయపడుతున్నారు. ప్రతిభ ఉన్నప్పటికీ సరైన అవకాశాల కోసం ఎదురుచూస్తున్న నటుల్లో గగన్ విహారి ఒకరు. 118, చాణక్య, గాలి సంపత్, శశి, 1996 ధర్మపురి, ఓదెల రైల్వే స్టేషన్, పుష్ప, పుష్ప 2, మజాకా, ఓదెల 2, 12A రైల్వే కాలనీ వంటి పలు చిత్రాల్లో నటిస్తూ తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా నటించిన 118 చిత్రంలో రోనీ పాత్రలో తన నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. విలన్ పాత్రల్లోనూ తనదైన శైలిని ప్రదర్శిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ముఖ్యంగా పుష్ప 2 క్లైమాక్స్ సన్నివేశాల్లో ఆయన ప్రదర్శించిన విలనిజం, సీతా కళ్యాణ వైభోగమే చిత్రంలో ప్రతినాయకుడిగా చేసిన నటన ఆయనలోని నటనా వైవిధ్యాన్ని చాటిచెప్పాయి. పాత్ర ఏదైనా దానికి తగిన హావభావాలు, సంభాషణల పలుకుబడి, తెరపై ప్రత్యేక ఉనికిని ప్రదర్శించగల సామర్థ్యం ఆయనలో కనిపిస్తుంది. నటనతో పాటు వ్యక్తిగతంగా కూడా అందరితో కలుపుగోలుగా, ఆప్యాయంగా మెలుగుతూ స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించడం ఆయన వ్యక్తిత్వంలోని ప్రత్యేకతగా పరిచయస్తులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కాస్ట్ (Caste) వంటి రాబోయే చిత్రాల్లోనూ నటిస్తూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, ప్రతినాయకుడిగా విభిన్న పాత్రలు పోషించిన గగన్ విహారికి మంచి కథ, బలమైన పాత్రతో హీరోగా అవకాశం లభిస్తే తనలోని పూర్తి నటనా ప్రతిభను ప్రేక్షకులకు పరిచయం చేసే అవకాశం ఉంటుంది. దర్శకులు, నిర్మాతలు ఆయన నటనా సామర్థ్యాన్ని గుర్తించి హీరోగా మంచి అవకాశాలు కల్పించాలని అభిమానులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షిస్తున్నారు. సరైన అవకాశం, మంచి కథ తోడైతే హీరోగా కూడా ప్రేక్షకుల ఆదరణ పొందగలరనే ఆశాభావం వ్యక్తమవుతోంది. గగన్ విహారికి మరిన్ని వైవిధ్యమైన పాత్రలు, మంచి అవకాశాలు లభించి సినీ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిద్దాం.

ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడిగా జమునగళ్ల కుమార్ మాదిగ ఏకగ్రీవ ఎన్నిక



మెదక్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) మెదక్ జిల్లా ముఖ్య సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేదాసి మోహన్ మాదిగ నాయకత్వంలో మెదక్ జిల్లా నూతన అధ్యక్షుడిగా జమునగళ్ల కుమార్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు కుమార్ మాదిగ మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉపకులాల ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. మాదిగలకు ఎక్కడైనా అవమానం జరిగినా, అన్యాయం ఎదురైనా వారి తరఫున ముందుండి పోరాటం చేస్తానని, జాతి గౌరవం, ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదస్సులో ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పుర ప్రభాకర్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యదర్శులు ఎర్ర లింగం మాదిగ, సంజీవులు మాదిగ, బాబు మాదిగ, శీను మాదిగ, రూప్ల నర్సింలు, ఆనంద్ మాదిగ, చెవిటి శ్రీనివాస్, ఎంఎస్ఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాదిగ, మనోజ్ కుమార్ మాదిగ, లచ్చిగాళ్ల దేవయ్య, పృథ్వీ మాదిగ, లక్ష్మణ్ మాదిగ, ప్రభాకర్ మాదిగ తదితర ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



మెదక్ పర్యాటక అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక.. సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించాలి

మెదక్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ ప్రచారం కల్పించాలని ఆదేశించారు. మెదక్ ఖిల్లా వద్ద జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు బారికేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పర్యాటకుల సమగ్ర ప్రణాళికలు రూపొందించి, చారిత్రక, ఆధ్యాత్మిక సౌకర్యార్థం టికెట్ కౌంటర్, గైడ్, భద్రతా సిబ్బందిని పర్యాటక ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా పర్యాటక అభివృద్ధి కమిటీ మూడవ విడత సమావేశాన్ని కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన మొదటి, రెండవ విడత సమావేశాల్లో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల అమలు తీరును కలెక్టర్ సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని మెదక్ జిల్లాకు పర్యాటక శోభ తీసుకొచ్చేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను ప్రజలకు తెలియజేసేలా సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. మెదక్ ఖిల్లా వద్ద పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన బారికేడింగ్, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఏడుపాయల ఆలయ పరిసరాల్లో కాటేజీల నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించాలని, మెదక్ ఖిల్లా వద్ద సోలార్ లైటింగ్ ఏర్పాటు చేసి సాయంత్రం వేళల్లో పర్యాటకులకు కనువిందు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, పర్యాటక అభివృద్ధి అధికారి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, టూరిజం కార్పొరేషన్ డీఈ శ్రీశైలం, డీపీఆర్వో రామచంద్రరాజు, ఈడీఎం సందీప్, ఏడుపాయల ఆలయ ఈఓ వీరేశం, మున్సిపల్ అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దీపావళి వేడుకల్లో కంటి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. లలితా దేవి

సంగారెడ్డి, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): దీపావళి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. లలితా దేవి శుభాకాంక్షలు తెలిపారు. వెలుగుల పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా, సురక్షితంగా జరుపుకోవాలని, బాణాసంచా కాల్చే సమయంలో కంటి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా కంటి చూపుకు ప్రమాదం కలిగించే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా పిల్లలు ఒంటరిగా బాణాసంచా కాల్చకుండా తల్లిదండ్రులు, పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలని, సీమటపాకాయలు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు వంటి ప్రమాదకరమైన టపాసులను పిల్లల చేతికి ఇవ్వవద్దని కోరారు. టపాసులు కాల్చేటప్పుడు తగినంత దూరంలో నిలబడాలని, వంగి చూడకూడదని, వెలగని టపాకాయలను మళ్లీ వెలిగించే ప్రయత్నం చేయవద్దని సూచించారు. వెలగని టపాకాయలపై నీళ్లు పోసి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. కాటన్ దుస్తులు ధరించడం, చేతులకు గ్లౌజులు వేసుకోవడం మంచిదని, నైలాన్, సింథటిక్ దుస్తులకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. టపాసులు కాల్చేటప్పుడు కంట్లో నిప్పురవ్వలు లేదా మసి పడితే కంటిని చేతులతో రుద్దకూడదని, శుభ్రమైన చల్లటి నీటితో నెమ్మదిగా కడిగి, వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి లేదా కంటి వైద్య నిపుణుడిని సంప్రదించాలని సూచించారు. కంటికి కట్టు కట్టడం, వైద్యుల సలహా లేకుండా ఇంట్లో మందులు వేసుకోవడం చేయకూడదని తెలిపారు. బాణాసంచాను బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే కాల్చాలని, సమీపంలో నీళ్ల బకెట్, ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఉబ్బసం, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు బాణాసంచా పొగకు దూరంగా ఉండాలని, జంతువులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పర్యావరణానికి తక్కువ హాని కలిగించే గ్రీన్ క్రాకర్స్ వినియోగిస్తూ దీపావళిని ఆనందంగా, ఆరోగ్యంగా జరుపుకోవాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అత్యవసర వైద్య సహాయం అవసరమైనప్పుడు 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని డా. లలితా దేవి సూచించారు.

విస్టా క్విజ్ పోటీల్లో సెయింట్ పాల్స్ పాఠశాలకు ప్రథమ స్థానం





ద్వితీయ స్థానంలో ఆర్మీ పబ్లిక్ పాఠశాల.. విజేతలకు నగదు బహుమతుల ప్రదానం

హైదరాబాద్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): విస్టా క్విజ్ సర్క్యూట్ రెండో విడత పోటీల్లో సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. శ్రీ విష్ణు విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం బాచుపల్లిలోని బీవీఆర్ఐటీ హైదరాబాద్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో 23 పాఠశాలలకు చెందిన 69 జట్లలో మొత్తం 138 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సమకాలీన అంశాలపై నిర్వహించిన ఈ పోటీల్లో సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలకు చెందిన లక్ష్ చవాన్, మహమ్మద్ అర్మాన్ ఉల్లా సిద్ధిఖీ జట్టు విజేతగా నిలిచి రూ.20 వేల నగదు బహుమతిని అందుకుంది. బొల్లారంలోని ఆర్మీ పబ్లిక్ పాఠశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.15 వేలు, ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచి రూ.10 వేల నగదు బహుమతులను గెలుచుకున్నాయి. పోటీల్లో భాగంగా నిర్వహించిన ఆహార పదార్థాల గుర్తింపు విభాగం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో వివిధ ఆహార పదార్థాలను రుచి చూసి వాటికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సి వచ్చింది. తొలుత రాత పరీక్ష నిర్వహించి, అనంతరం రెండు అర్ధ తుది పోటీలు, తుది పోటీలను నిర్వహించారు. అర్ధ తుది పోటీల్లో ప్రతిభ కనబరిచిన సెయింట్ పాల్స్ జట్టు తుది పోటీల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించి విజయం సాధించింది. విద్యార్థుల్లో సమకాలీన అంశాలపై అవగాహన, జిజ్ఞాస, స్వతంత్ర ఆలోచనా విధానాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో విష్ణు విద్యా సంస్థల అధ్యక్షుడు కె.వి. విష్ణు రాజు ఆలోచన మేరకు ఈ పోటీలకు రూపకల్పన చేశారు. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రపంచ పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి విష్ణు విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు రవిచంద్రన్ రాజగోపాల్ హాజరుకాగా, పోటీలను విస్టా క్విజ్ సంచాలకుడు న్యాయపతి గౌతమ్ నిర్వహించారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని, పోటీతత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

చిప్పలతుర్తి కేజీబీవీలో ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం.. విద్యార్థినులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం



నర్సాపూర్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిప్పలతుర్తి గ్రామపంచాయతీ పరిధిలోని జానకంపేట తండా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు స్వచ్ఛమైన, శుద్ధి చేసిన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రమైన తాగునీరు ఎంతో అవసరమని పేర్కొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల సిబ్బంది, విద్యార్థినులతో మాట్లాడి పాఠశాలలోని సౌకర్యాలు, విద్యా కార్యక్రమాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మున్సిపల్ ప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేత, హెల్ట్రో ప్రతినిధి సుధాకర్, ఎంపీడీఓతో పాటు పలువురు నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అనుదీప్ జన్మదిన వేడుకలు.. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య ఆనందోత్సాహాలు



నవంబర్ 09 (సందేశం టైమ్స్ సంగారెడ్డి): సందేశం టైమ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ సంగమేశ్వర్ గారి కుమారుడు అనుదీప్ జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అనుదీప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో అత్తమ్మ, మామయ్య, భారతి పిన్ని, శోభా పిన్ని, దాసు, సునంద కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు పాల్గొని అనుదీప్‌ను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయత, ఆనందం వెల్లివిరిసిన ఈ వేడుక ప్రత్యేకంగా నిలిచింది.




పందిళ్ళపల్లిలో రూ.20.04 లక్షలతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు.. లో-వోల్టేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

చింతకాని, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్ళపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.20.04 లక్షల వ్యయంతో నూతన విద్యుత్ లైన్లు, ఎక్స్‌టెన్షన్ పోల్స్ ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో మంజూరైన నిధులతో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల సమీపంలో ఈ పనులను ప్రారంభించారు. గ్రామంలో చాలాకాలంగా ఎదురవుతున్న విద్యుత్ సమస్యలు, లో-వోల్టేజీ ఇబ్బందులను పరిష్కరించడమే లక్ష్యంగా ఈ నిధులను కేటాయించారు. పనుల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లతో పాటు గ్రామంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న నివాసాలకు విద్యుత్ సదుపాయం మెరుగుపరిచేందుకు నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లను విస్తరించనున్నారు. ఈ పనులు పూర్తయితే గ్రామ ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందడంతో పాటు లో-వోల్టేజీ సమస్యలు తగ్గనున్నాయి. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వత్సవాయి పద్మ, వత్సవాయి జానకిరాములు, ఉప సర్పంచ్ మేకల కల్పన, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగ సూరా రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆనం ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు ఎన్పీడీసీఎల్ బోనకల్ ఏడీఈ, నాగులవంచ ఏఈ, సంబంధిత కాంట్రాక్టర్, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామస్తులు హాజరయ్యారు. గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపి రూ.20.04 లక్షల నిధులు మంజూరు చేయడంతో పాటు పనుల ప్రారంభానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



సంగారెడ్డిలో దీపావళి అమ్మకాల సందడి.. కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్లు..

సంగారెడ్డి, నవంబర్ 09 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి.సంగమేశ్వర్): దీపావళి పండుగను పురస్కరించుకొని సంగారెడ్డి పట్టణంలో వ్యాపారస్తులు వివిధ రకాల పండుగ సామగ్రిని విక్రయిస్తూ సందడి చేస్తున్నారు. పట్టణంలోని మార్కెట్లలో దీపావళికి అవసరమైన ప్రమిదలు, అలంకరణ వస్తువులు, పూజా సామగ్రి, బొమ్మలు తదితర వస్తువులను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. పండుగ సమీపిస్తుండటంతో కొనుగోలుదారులు మార్కెట్లకు చేరుకుని తమకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో వ్యాపారస్తులు ఆశాజనకమైన అమ్మకాలు జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పండుగ నేపథ్యంలో మార్కెట్లలో సందడి నెలకొంది.



బాణాసంచా దుకాణాల్లో భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ జి. నరేష్

చింతకాని, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా దుకాణదారులు ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చింతకాని ఎస్ఐ జి. నరేష్ సూచించారు. బాణాసంచా దుకాణాల వద్ద ఎలాంటి అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దుకాణం వద్ద ఇసుక, నీటి డ్రమ్ములు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు అగ్నిప్రమాదం సంభవించినప్పుడు వెంటనే మంటలను అదుపు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. దుకాణాల పరిసరాల్లో ఎవరూ సిగరెట్లు, బీడీలు తాగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాణాసంచా దుకాణాల వద్ద చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా బాణాసంచా విక్రయాలు నిర్వహించినా, భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా సంబంధిత దుకాణదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని, దీపావళి వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా దుకాణదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

చీకట్లను పారద్రోలి ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి.. ప్రజలకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ దీపావళి శుభాకాంక్షలు



నవంబర్ 09 (సందేశం టైమ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా, నియోజకవర్గ ప్రజలకు సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగను ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరియాలని, చీకట్లను పారద్రోలి ఆశలు, ఆకాంక్షలతో కూడిన కొత్త వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. అదే విధంగా బాణాసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ పర్యావరణానికి, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా సురక్షితంగా పండుగ జరుపుకోవాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సూచించారు.

విష్ణు ఉన్నత పాఠశాలలో ఘనంగా పర్యావరణహిత దీపావళి వేడుకలు.. కాలుష్యరహిత పండుగపై విద్యార్థుల ప్రతిజ్ఞ



మెదక్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ప్రాంగణంలో గల విష్ణు ఉన్నత పాఠశాలలో శనివారం పర్యావరణహిత దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నాగజ్యోతి విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టత, ప్రాముఖ్యతను వివరించారు. పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు పర్యావరణానికి హాని కలిగించని రీతిలో దీపావళి జరుపుకుంటామని, వాయు, శబ్ద కాలుష్యానికి కారణమయ్యే బాణాసంచాకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సహజ రంగులతో అందమైన ముగ్గులు వేసి తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించగా, మరికొందరు పిండి, మట్టితో సంప్రదాయ ప్రమిదలను తయారు చేసి సృజనాత్మకతను చాటుకున్నారు. పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రతిబింబించేలా వివిధ ఆకృతులను రూపొందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. బీవీఆర్ఐటీ కళాశాల డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, జనరల్ మేనేజర్ బాపిరాజు, పరిపాలన అధికారి సురేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేలా వేడుకలు విజయవంతంగా నిర్వహించడంతో పాఠశాల యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది.



సంగారెడ్డి పట్టణ అభివృద్ధికి పెద్దపీట.. రూ.55 లక్షలతో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం

నవంబర్ 09 (సందేశం టైమ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): సంగారెడ్డి పట్టణంలోని పలు వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన పనులకు మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ శ్రీకారం చుట్టారు. పట్టణంలోని 9వ వార్డు సప్తగిరి కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను, 35వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రారంభించిన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీలత శ్రీశైలం, నర్సమ్మ ప్రసాద్, సంగీత మహేష్, సతీష్ రెడ్డి, వంశీ, శైలేష్ రెడ్డి, రవి నాయక్, కాంగ్రెస్ నాయకులు సురేష్, కిరణ్, రమేష్‌తో పాటు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగుల సంబరాలు.. నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం: కాంగ్రెస్ నాయకులు

నవంబర్ 09 (సందేశం టైమ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీ కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు దీపావళి సంబరాలు నిర్వహించారు. జిన్నారం 18వ వార్డు కౌన్సిలర్ ఎర్రవల్లి దీనా ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు అందేలా తమ వంతు ప్రయత్నం కొనసాగిస్తామని, ఇల్లు లేదని ఏ ఒక్క పేద కుటుంబం ఆందోళన చెందకుండా ప్రభుత్వానికి నివేదిక అందించి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకరయ్య, గోకర వెంకటేష్, పల్నాటి భాస్కర్, యనగండ్ల నరేందర్, వడ్ల నరేష్, అనిల్, లాలు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరవెల్లి గ్రామ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన పట్లోళ్ల శివశరణ్.. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్ష



నవంబర్ 09 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): దీపావళి పండుగను పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలోని వట్టిపల్లి మండలం మరవెల్లి గ్రామ ప్రజలకు పట్లోళ్ల శివశరణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో నూతన ఆశలు, ఆనందాలు తీసుకురావాలని కోరారు. గ్రామ ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా, ఆనందోత్సాహాల మధ్య దీపావళి పండుగను జరుపుకోవాలని పట్లోళ్ల శివశరణ్ ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్యం.. పీఎం రహత్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: నర్సాపూర్ ఎస్ఐ రంజిత్ రెడ్డి



నర్సాపూర్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స ఆలస్యం కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రహత్ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని నర్సాపూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్ఠంగా ఏడు రోజుల వరకు వైద్య చికిత్స పొందే అవకాశం ఉందని, బాధితుల ఆదాయంతో సంబంధం లేకుండా పథకం నిబంధనల ప్రకారం అర్హులైన వారికి ఈ సదుపాయం వర్తిస్తుందని వివరించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పట్టణ, గ్రామీణ రహదారులపై జరిగే మోటారు వాహన ప్రమాదాల్లో గాయపడిన వారికి గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112కు ఫోన్ చేయాలని, క్షతగాత్రులను వీలైనంత త్వరగా సమీపంలోని పీఎం రహత్ పథకం పరిధిలోని గుర్తింపు పొందిన ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఆసుపత్రి సిబ్బందికి పీఎం రహత్ పథకం కింద వైద్య చికిత్స అందించాలని తెలియజేయాలని కోరారు. రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, డబ్బుల సమస్యతో ఎవరూ వైద్య చికిత్సకు దూరం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామ ప్రజలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారాన్ని ప్రచారం చేయాలని ఎస్ఐ రంజిత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరి అప్రమత్తత మరొకరి ప్రాణాలను కాపాడగలదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి.. ఎల్లంకి డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన కార్యక్రమం

నర్సాపూర్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జాతీయ న్యాయ సేవా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నర్సాపూర్‌లోని ఎల్లంకి డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎస్ఐ-2 జగన్నాథ్, సీనియర్ న్యాయవాది సీహెచ్ స్వరూపారాణి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లగండ్ల అశోక్ కుమార్ పటేల్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు చట్టాలు, న్యాయపరమైన హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచే భారత రాజ్యాంగం, చట్టాలు కల్పించిన హక్కులు, బాధ్యతలపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మహిళలు, బాలలపై వేధింపులు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, పోక్సో చట్టం, బాలల హక్కులు, సైబర్ నేరాల నివారణ చర్యలు, ఉచిత న్యాయ సహాయం వంటి అంశాలను వివరించారు. ఎవరైనా అన్యాయానికి గురైతే భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించి చట్టబద్ధంగా న్యాయం పొందాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ న్యాయానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో న్యాయ సేవాధికార సంస్థలు అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు కార్యక్రమం ద్వారా తెలుసుకున్న న్యాయపరమైన అంశాలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు తెలియజేస్తూ ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, ఎం. అరుణ, వై. శ్రీనివాస్‌తో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



బహిరన్ దిబ్బ గ్రామ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ పంపాటి వీరప్ప

మెదక్ / అల్లాదుర్గం, నవంబర్ 9 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్): దీపావళి పండుగను పురస్కరించుకుని బహిరన్ దిబ్బ గ్రామ ప్రజలకు గ్రామ సర్పంచ్ పంపాటి వీరప్ప హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యం, సోదరభావంతో పండుగను జరుపుకోవాలని, బహిరన్ దిబ్బ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరూ ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరోసారి ప్రతి ఒక్కరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.



పేరెంట్–టీచర్ సమావేశానికి హాజరై విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న సర్పంచ్ బంజ లావణ్య రవి

వెల్దుర్తి, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శేరిల్లా గ్రామంలో నిర్వహించిన పేరెంట్–టీచర్ సమావేశానికి గ్రామ సర్పంచ్ బంజ లావణ్య రవి హాజరై విద్యార్థుల సమస్యలు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, ఉదయం అందించే అల్పాహారం తదితర అంశాలపై విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన సౌకర్యాల గురించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో చర్చించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని సర్పంచ్ బంజ లావణ్య రవి తెలిపారు.

రైతుల పంటలు ఎండిపోతున్నా.. రిసార్ట్‌కు మాత్రం చెరువు నీరు!





అక్రమంగా మోటార్ల ఏర్పాటు ఆరోపణలు.. మోటార్లు సీజ్ చేసినట్లు సమాచారం.. రేపు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుకు సిద్ధం

నర్సాపూర్, నవంబర్ 9 (సందేశం టైమ్స్): రైతుల సాగు అవసరాలకు ఉపయోగపడాల్సిన రాయరావు చెరువు నీటిని ప్రైవేట్ రిసార్ట్ అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు మెదక్ జిల్లా నర్సాపూర్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాయరావు చెరువు నుంచి అలంకార రిసార్ట్ యాజమాన్యం అక్రమంగా మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తోడుకుంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు చెరువు కింద సాగు చేస్తున్న రైతులు సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితిని ఎదుర్కొంటుండగా, మరోవైపు ప్రైవేట్ రిసార్ట్ అవసరాల కోసం చెరువు నీటిని తరలిస్తున్నారనే ఆరోపణలు రైతుల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి. చెరువు నుంచి సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరగా, జిల్లా అధికారుల అనుమతులు లేవని, నీటిని విడుదల చేయడం సాధ్యం కాదని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపినట్లు సమాచారం. దీంతో సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే రైతులకు సాగునీరు అందించేందుకు అనుమతులు లేవని చెబుతున్న అధికారులు, అదే చెరువు నుంచి ప్రైవేట్ రిసార్ట్‌కు నీటిని తరలిస్తున్నారనే ఆరోపణలపై ఏం సమాధానం చెబుతారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రిసార్ట్ అవసరాల కోసం చెరువు నీటిని వినియోగించుకునేందుకు ఎవరు అనుమతిచ్చారు? సంబంధిత శాఖల అధికారులకు ఈ విషయం ముందుగా తెలియదా? అనే సందేహాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై స్పందించిన మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు చెరువు వద్ద ఏర్పాటు చేసిన మోటార్లను సీజ్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు గురువారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే కేవలం మోటార్లను సీజ్ చేయడంతోనే ఈ వ్యవహారాన్ని ముగించకుండా, చెరువు నీటి వినియోగానికి సంబంధించి అనుమతులు ఉన్నాయా? ఎంతకాలంగా నీటిని తోడుకుంటున్నారు? దీనివల్ల రైతుల సాగునీటి అవసరాలపై ఎలాంటి ప్రభావం పడింది? అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజా అవసరాలకు, వ్యవసాయానికి ఉపయోగపడాల్సిన చెరువు నీటిని ప్రైవేట్ అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు అధికారుల పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రాయరావు చెరువు నీటి వినియోగంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని, రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నీటి వినియోగం జరిగినట్లు విచారణలో తేలితే సంబంధిత రిసార్ట్ యాజమాన్యంపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతుల పంటలకు నీరివ్వడానికి అనుమతులు లేవని చెబుతున్న అధికారులు.. ప్రైవేట్ రిసార్ట్ నీటి వినియోగంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

చేయూత పింఛన్లు, రాజీవ్ యువ వికాసం పథకాలకు వెంటనే నిధులు మంజూరు చేయాలి



సంగారెడ్డి, నవంబర్ 09 (సందేశం టైమ్స్) మెదక్ జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేయూత పింఛన్లు, రాజీవ్ యువ వికాసం పథకాలకు నిధులు మంజూరు చేసి అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు, స్వయం ఉపాధి రుణాలు అందించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీసీ సంక్షేమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టి పోరాటం కొనసాగిస్తామని ప్రభుగౌడ్ స్పష్టం చేశారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్టోళ్ల మల్లికార్జున పాటిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రభుగౌడ్, ఉపాధ్యక్షుడు డి. కిష్టయ్య, ప్రధాన కార్యదర్శులు పార్వతి కృష్ణ, నాగరాణి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. అంజనేయులు, ప్రధాన కార్యదర్శి జె. రాజేశ్వర్ స్వామి, కోశాధికారి సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షులు శ్రీధర్, మహేందర్, ముఖ్య సలహాదారు కరంజిత్ సింగ్, కార్యదర్శులు గౌలీశ్వర్, శ్రీనివాస్, ప్రవీణ్, మహేష్, సభ్యులు యాదగిరి, రవీందర్ పాల్గొన్నారు. అలాగే యూత్ కమిటీ అధ్యక్షుడు జావిద్, మహిళా కమిటీ అధ్యక్షురాలు మంజుల గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షురాలు మానస, కార్యదర్శి వీరమణి, సదాశివపేట మండల అధ్యక్షురాలు మౌనిక తదితరులు పాల్గొన్నారు.



నేటి ద్వాదశ రాశి ఫలితాలు – నవంబర్ 9, 2026

నవంబర్ 09, 2026 సోమవారం నాటి ద్వాదశ రాశి ఫలాలు

నవంబర్ 09, 2026 (సందేశం టైమ్స్ ప్రతినిధి): నవంబర్ 09 సోమవారం నాటి ద్వాదశ రాశి ఫలాల వివరాల ప్రకారం మేష రాశి వారికి చేపట్టిన పనుల్లో విజయం, ప్రముఖుల పరిచయాలు, వ్యాపార ఉద్యోగాల్లో అనుకూలతలు లభించి విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు; వృషభ రాశి వారికి ఆరోగ్య సమస్యలు, పనుల్లో అవాంతరాలు, ఆకస్మిక ప్రయాణాలు మరియు కుటుంబంలో మాటపట్టింపులు ఎదురయ్యే అవకాశం ఉంది; మిథున రాశి వారికి వ్యాపార లాభాలు, సన్నిహితుల నుంచి ధనలాభం, నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం మరియు ఉద్యోగ సమస్యల పరిష్కారం లభిస్తాయి; కర్కాటక రాశి వారికి ఉద్యోగంలో ఊహించని సమస్యలు, సోదరులతో స్థిరాస్తి వివాదాలు, వ్యాపార మందగమనం మరియు ప్రయాణ సూచనలు ఉన్నాయి; సింహ రాశి వారికి గృహంలో శుభకార్యాలు, వృత్తి వ్యాపార విస్తరణ, ఉద్యోగ పురోగతి మరియు రాజకీయ, సామాజిక రంగాల్లో విజయం లభిస్తాయి; కన్యా రాశి వారికి విందు వినోదాలు, స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలించడం, సంతాన వివాహ ప్రస్తావనలు మరియు పనుల్లో కార్యసిద్ధి కలుగుతాయి; తులా రాశి వారికి దైవదర్శనాలు లభించినప్పటికీ దీర్ఘకాలిక రుణాలు, సోదరుల వివాదాలు, స్వల్ప అనారోగ్యం మరియు వ్యాపార నిరాశ ఎదురుకావచ్చు; వృశ్చిక రాశి వారికి ఆకస్మిక నిర్ణయాల మార్పులు, మందకొడిగా సాగే పనులు, దైవసేవా కార్యక్రమాలు ఉన్నప్పటికీ ఉద్యోగ సమస్యలు పరిష్కారమవుతాయి; ధనుస్సు రాశి వారికి పాత సమస్యల పరిష్కారం, గౌరవ మర్యాదలు పెరగడం, ఆత్మీయుల శుభకార్య ఆహ్వానాలు అందుతాయి; మకర రాశి వారికి ఆత్మీయుల శుభవార్తలు, నూతన వాహన యోగం, ప్రముఖుల పరిచయాలు, వ్యాపార లాభాలు మరియు ఉద్యోగులకు పదోన్నతి అవకాశాలు కలుగుతాయి; కుంభ రాశి వారికి ఆలయ సందర్శనాలు, సమాజసేవ, మొండి బాకీల వసూలుతో పాటు దూరప్రయాణాలు మరియు ఉద్యోగంలో కొంత గందరగోళం ఎదురవుతుంది; మీన రాశి వారికి ఆకస్మిక ప్రయాణాలు, రుణాల ఒత్తిడి, పనుల వాయిదా, అనారోగ్య చికాకులు మరియు ఉద్యోగ వ్యాపారాలు మందకొడిగా సాగే సూచనలు ఉన్నాయని రాశి ఫలాలు తెలియజేస్తున్నాయి.



అనంతసాగర్‌లో నూతన గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్...

నవంబర్ 09 (సందేశం టైమ్స్) తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి.సంగమేశ్వర్).సంగారెడ్డి జిల్లా అనంతసాగర్ గ్రామంలో కుమార్ నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుమార్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం గ్రామ సర్పంచ్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను సర్పంచ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సర్పంచ్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, స్థానిక పరిస్థితులపై నాయకులు పరస్పరం చర్చించుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చిలిపిచేడ్ పాఠశాలలో శిథిలావస్థకు చేరిన తరగతి గదులు.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: దండె అపర్ణ

చిలిపిచేడ్, నవంబర్ 9 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. నంగమేశ్వర్): మెదక్ జిల్లా చిలిపిచేడ్ మండల కేంద్రంలోని ఎంపీపీఎస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తెలంగాణ రక్షణ సేన పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దండె అపర్ణ గురువారం సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులు, మౌలిక వసతులను పరిశీలించిన ఆమె 6, 7, 8 తరగతులకు సంబంధించిన గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు కూర్చోవడానికి సరిపడా బెంచీలు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణమే నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అక్షయపాత్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని దండె అపర్ణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాలు వ్యాపార కేంద్రాలుగా ఎదగాలి.. మహిళా పారిశ్రామికవేత్తలుగా రాణించాలి: డీఆర్డీఓ ఉమాహారతి

సంగారెడ్డి, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య 110వ సమావేశం జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి యోగేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి డీఆర్డీఓ ఎన్. ఉమాహారతి, ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు కేవలం పొదుపు సంఘాల సభ్యులుగా మాత్రమే కాకుండా వ్యాపారవేత్తలుగా ఎదగాలని, పొదుపు సంఘాలు వ్యాపార కేంద్రాలుగా రూపుదిద్దుకోవాలని సూచించారు. మహిళా సమాఖ్యలు కేవలం రుణాల వితరణ సంస్థలుగా కాకుండా వ్యాపార రంగంలోనూ రాణించాలని, ప్రతి మండల సమాఖ్య ఆదాయం సమకూర్చే కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. ఇందుకోసం అవసరమైన శిక్షణ, పెట్టుబడి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే నెల సమావేశానికి వ్యాపార ప్రభావం నేపథ్యంలో వీబీజీ రామ్ జీ పథకం ద్వారా ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, అవకాశం ఉన్న ప్రాంతాల్లో నీటి కుంటలు నిర్మించుకోవాలని తెలిపారు. సమావేశంలో డీపీఎంలు సెర్ప్ కార్యక్రమాల అమలుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అదనపు డీఆర్డీఓ, జిల్లాలోని 23 మండలాల మహిళా సమాఖ్యల అధ్యక్షులు, డీపీఎంలు హాజరయ్యారు.

డోర్లు మూసిన తర్వాతే బస్సులు నడపాలి.. టీజీఎస్ఆర్టీసీ కీలక ఆదేశాలు



హైదరాబాద్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మణుగూరు డిపోకు చెందిన కండక్టర్ ప్రవళిక మృతి నేపథ్యంలో సిబ్బంది, ప్రయాణికుల భద్రత దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆర్టీసీ బస్సులన్నింటికీ డోర్లు ఏర్పాటు చేయాలని, డోర్లు పూర్తిగా మూసిన తర్వాతే బస్సులను ముందుకు నడపాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధన అన్ని రకాల బస్సులకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. బస్సులో చిల్లర విషయంలో ప్రయాణికురాలితో వాగ్వాదం జరిగిన సమయంలో కండక్టర్ ప్రవళికను సదరు ప్రయాణికురాలు తోసివేయడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రవళిక మృతి చెందారు. ఈ ఘటన నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది.



ప్రతి బిడ్డ జీవితం అమూల్యమైనది.. శిశువులను నిర్లక్ష్యంగా వదిలేయకండి: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రతి బిడ్డ జీవితం అమూల్యమైనదని, అప్పుడే పుట్టిన శిశువులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వదిలివేయకూడదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. పిల్లలను అనాథలుగా వదిలేయకుండా వారికి సురక్షితమైన భవిష్యత్తును అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పిల్లల సంరక్షణపై గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మెదక్ జిల్లాలో అనాథగా లేదా అవాంఛితంగా మారిన శిశువులను నడిరోడ్డుపై, చెత్తకుప్పల్లో, నిర్మానుష్య ప్రాంతాల్లో వదిలివేయకుండా ప్రభుత్వ రక్షణ కేంద్రాలకు అప్పగించాలని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, సామాజిక ఒత్తిళ్లు, వివాహేతర సంబంధాలు లేదా ఇతర వ్యక్తిగత కారణాలతో బిడ్డను పెంచలేని పరిస్థితి ఏర్పడితే భయపడకుండా మహిళా, శిశు సంక్షేమ శాఖను సంప్రదించాలని సూచించారు. వివాహేతర సంబంధాల వల్ల జన్మించిన పిల్లల విషయంలోనూ తల్లిదండ్రులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తల్లిదండ్రుల వ్యక్తిగత పరిస్థితులు, సామాజిక నేపథ్యాన్ని గౌరవిస్తూ చట్టబద్ధమైన విధానాల ద్వారా శిశువులకు రక్షణ, సంరక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. బిడ్డను అప్పగించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు, వారి గౌరవానికి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బిడ్డను పెంచలేని తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యులు మహిళా, శిశు సంక్షేమ శాఖను సంప్రదిస్తే అవసరమైన సహాయం అందిస్తామని వెల్లడించారు.

విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరం.. పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: సర్పంచ్ ఓబినబోయిన లక్ష్మి అచ్చయ్య



చింతకాని, నవంబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో అవసరమని పాతర్లపాడు గ్రామ సర్పంచ్ ఓబినబోయిన లక్ష్మి అచ్చయ్య అన్నారు. పాతర్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారితో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి అభిరుచులు, చదువులో పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి నివేదికలను పరిశీలించి, వారి విద్యా పురోగతిపై తల్లిదండ్రులతో చర్చించారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దారెల్లి సురేష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు విక్రయాలపై ఈగల్ ఫోర్స్ దాడులు.. ఎనిమిది మందికి బెంజోడియాజిపైన్ పాజిటివ్, నలుగురు అరెస్ట్.. ఇద్దరు పరారీ



మెదక్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లాలో కల్తీ కల్లు విక్రయాలపై తెలంగాణ ఈగల్ ఫోర్స్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. హవేలీ ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బురుగుపల్లి, వాడి గ్రామాల్లో గురువారం ఈగల్ ఫోర్స్, ఆర్ఎన్‌సీసీ సంగారెడ్డి బృందం, మెదక్ రూరల్ పోలీసులు సంయుక్తంగా ఏకకాలంలో దాడులు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో ఐదు కల్లు దుకాణాలు, ఒక కల్లు డిపోలో సోదాలు నిర్వహించారు. కల్తీ కల్లు తాగినట్లు అనుమానించిన ఎనిమిది మందికి పరీక్షలు నిర్వహించగా, వారందరికీ బెంజోడియాజిపైన్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కల్లులో నిషేధిత మత్తు పదార్థాలు కలిపినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో బుచ్చమొల్ల వీరేశం గౌడ్, కలాలి కిషన్ గౌడ్, కొత్తపల్లి నర గౌడ్, కొత్తపల్లి లక్ష్మణ్ గౌడ్‌లను పోలీసులు అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు నిందితులు పదమటి శ్రీనివాస్ గౌడ్, కొండ శ్రీనివాస్ గౌడ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దాడుల్లో 180 అక్రమ కల్లు బాటిళ్లు (15 బాక్సులు), నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి హవేలీ ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఐదు ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేశారు. కల్తీ కల్లు తాగిన ఎనిమిది మందికి కౌన్సెలింగ్ నిర్వహించి డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించారు. కల్లులో మత్తు పదార్థాలను కలపడం, సరఫరా చేయడం, విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈగల్ ఫోర్స్ అధికారులు హెచ్చరించారు.

మల్లి గ్రామంలో చోరీ కేసును ఛేదించిన హద్నూర్ పోలీసులు.. ముగ్గురు నిందితుల అరెస్ట్



సంగారెడ్డి, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): హద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లి గ్రామంలో జరిగిన ఇంటి దొంగతనం కేసును పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మల్లి గ్రామానికి చెందిన అవుటి బసప్ప ఇంట్లో 2026 సెప్టెంబర్ 20వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఒక జత బంగారు కమ్మలు, మూడు చేతి ఉంగరాలు, రెండు జతల వెండి పట్టగొలుసులు, రెండు కడియాలు, రూ.60 వేల నగదును దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హద్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నవంబర్ 4వ తేదీన నమ్మదగిన సమాచారం మేరకు మల్లి గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. విచారణలో వారు మల్లి గ్రామంలో ఇంటి దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించారని, చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను బీదర్‌లో విక్రయించేందుకు వెళ్తున్నట్లు వెల్లడించారని పోలీసులు తెలిపారు. నిందితులుగా పవన్ (తండ్రి జేరెప్ప), యాకత్పూర్; ఎం.డి. హుస్సేన్ (తండ్రి ముల్తానీ), మొల్లవాలె; గుండప్ప (తండ్రి బీరప్ప), హమూరాబాద్‌కు చెందిన వారిని గుర్తించారు. వారి నుంచి 7.8 గ్రాముల బంగారు ఆభరణాలు, 13.1 తులాల వెండి ఆభరణాలు, రూ.50 వేల నగదు, చోరీ సొత్తును తరలించేందుకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచినట్లు హద్నూర్ ఎస్ఐ దోమ సుజిత్ తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన ఎస్ఐ సుజిత్‌తో పాటు పోలీసు సిబ్బంది మహేష్, శ్రీకాంత్, రాజశేఖర్, సాయికిరణ్, అశోక్‌లను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

100వ ఏట ప్రవేశించిన ఎల్.కే. అద్వానీ: బిజేపి సీనియర్ నేత సేవలను కొనియాడుతూ ప్రధాని మోదీ వ్యాసం





100వ ఏట ప్రవేశించిన ఎల్.కే. అద్వానీ: బిజేపి సీనియర్ నేత సేవలను కొనియాడుతూ ప్రధాని మోదీ వ్యాసం

న్యూఢిల్లీ, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ పితామహుడు, మాజీ ఉప ప్రధాని ఎల్.కే. అద్వానీ 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100వ పడిలోకి అడుగుపెట్టారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ అద్వానీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఒక ప్రత్యేక వ్యాసాన్ని విడుదల చేశారు. దేశ విభజన నాటి క్లిష్ట పరిస్థితుల నుంచి జీవితాన్ని పునర్నిర్మించుకోవడం, జనసంఘ్ బలోపేతం, బిజెపి నిర్మాణం, ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య రక్షణ, సోమనాథ్ నుండి అయోధ్య వరకు నిర్వహించిన చారిత్రాత్మక రథయాత్ర మరియు ప్రభుత్వంలో అందించిన అసమాన సేవలను ఈ వ్యాసంలో ప్రధాని గుర్తు చేసుకున్నారు. రాజకీయ వేత్తగానే కాకుండా పుస్తక ప్రియుడిగా, రచయితగా, కళలు-సినిమాల పట్ల ఆసక్తి కలిగిన వ్యక్తిగా అద్వానీలోని బహుముఖ కోణాలను ఆ వ్యాసంలో ప్రశంసించారు.

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో భద్రతా దళాలతో ప్రధాని మోదీ దీపావళి వేడుకలు

రాయ్‌పూర్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రధాని నరేంద్ర మోదీ దీపావళి పండుగను ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ వేదికగా దేశ భద్రతా దళాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. పండుగ రోజుల్లో కుటుంబాలకు దూరంగా దేశ సరిహద్దుల్లో, అంతర్గత రక్షణలో నిరంతరం శ్రమిస్తున్న సాయుధ దళాల త్యాగ నిరతిని ప్రధాని కొనియాడారు. వీర జవాన్ల మధ్య పండుగ జరుపుకోవడం తనకు ఎంతో మధురమైన అనుభూతిని ఇచ్చిందని తెలిపారు. ఒకప్పుడు నక్సలిజం ప్రభావంతో భయాందోళనల మధ్య ఉన్న బస్తర్ ప్రాంతం, నేడు భద్రతా దళాల అపూర్వ త్యాగాల వల్ల భయం నుండి విముక్తి పొంది అభివృద్ధి పథంలో పయనిస్తోందని, దేశం నక్సల్స్ రహితంగా మారడంలో సైనికుల పాత్ర అత్యంత కీలకమైనదని మోదీ ప్రశంసించారు.



రూ. 82 కోట్లతో వన్‌టాంగియా సమాజ అభివృద్ధికి 52 ప్రాజెక్టులు: సీఎం యోగి ఆదిత్యనాథ్

గోరఖ్‌పూర్, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కేవలం తమ సొంత కుటుంబాల ప్రయోజనాల గురించే ఆలోచించిన నాయకుల నుంచి పేదలు, దళితులు, వంచిత వర్గాల అభివృద్ధిని ఆశించడం దివాస్వప్నమేనని, 2017కు పూర్వం ఉత్తర ప్రదేశ్‌లో సరిగ్గా ఇలాంటి పరిస్థితే ఉండేదని రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విమర్శించారు. దశాబ్దాలుగా తీవ్ర ఉపేక్షకు గురైన వన్‌టాంగియా సమాజ అభ్యున్నతి, వారి జీవితాల్లో వెలుగులు నింపే దిశగా తమ ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తోందని స్పష్టం చేస్తూ, పావన పర్వదినమైన దీపావళి సందర్భంగా గోరఖ్‌పూర్‌లో రూ. 82 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టిన 52 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఉచిత కిట్లను పంపిణీ చేసిన సీఎం యోగి, వన్‌టాంగియా సమాజ ప్రజలకు మరియు లబ్ధిదారులందరికీ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రాంతీయ అభివృద్ధికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని పునరుద్ఘాటించారు.



నగరి ఎంపీటీసీ ఫలితాల్లో అవకతవకలు జరిగాయంటూ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద మాజీ మంత్రి ఆర్‌కే రోజా ఆందోళన

సందేశం టైమ్స్ ఆంధ్ర ప్రదేశ్ ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఉప ఎన్నికల లెక్కింపు సందర్భంగా చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విజయపురం మండలం ఇల్లత్తూరు ఎంపీటీసీ స్థానంలో తమ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం సాధించినప్పటికీ, అధికారులు కేవలం 3 ఓట్ల తేడాతో టీడీపీ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించారని ఆరోపిస్తూ మాజీ మంత్రి ఆర్‌కే రోజా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని, అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి ఫలితాన్ని తారుమారు చేశారని మండిపడుతూ ఆమె వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి కౌంటింగ్ కేంద్రం ముందు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో స్థానిక పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, న్యాయమైన రీకౌంటింగ్ నిర్వహించే వరకు తమ పోరాటం ఆపేది లేదని రోజా స్పష్టం చేశారు.



సోషల్ మీడియాలో మహిళలు, మైనర్ బాలికల పట్ల అసభ్యకర పోస్టులు చేస్తే కఠిన చర్యలు: వైరా సీఐ హెచ్చరిక

చింతకాని, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): చింతకాని పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్ 246/2026 కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు వైరా సీఐ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా మైనర్ బాలికలు మరియు మహిళల పట్ల అసభ్యకరమైన పోస్టులు చేయడం, అనుచిత వ్యాఖ్యలు చేయడం, లేదా వారి ఫొటోలు, వీడియోలను దుర్వినియోగం చేయడం లాంటి చర్యలకు పాల్పడితే ఐటీ చట్టంతో పాటు సంబంధిత తీవ్రమైన చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఎవరైనా వేధింపులకు గురైతే భయాందోళనలకు గురికాకుండా ధైర్యంగా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచిస్తూ, బాధితుల వివరాలను సంపూర్ణంగా గోప్యంగా ఉంచుతూ చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, మహిళలు మరియు బాలికల గౌరవానికి భంగం కలిగించే చట్టవ్యతిరేక చర్యలకు ఎవరూ పాల్పడవద్దని పోలీసులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్న జగ్గారెడ్డి: ప్రజలకు శుభాకాంక్షలు





సంగారెడ్డి, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి పట్టణంలోని రామ్‌నగర్‌లోగల తన స్వగృహంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగ వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకుని సతీమణి నిర్మల జగ్గారెడ్డి, కుమార్తె జయా చైతన్య రెడ్డిలతో కలిసి ఇంట్లో దీపాలు వెలిగించి వేడుకల్లో పాల్గొన్న ఆయన, అనంతరం సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలతో పాటు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలందరికీ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటిని పారద్రోలి వెలుగులు నింపే ఈ దివ్య పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఆనందం, శాంతి మరియు అష్టైశ్వర్యాలను నింపాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

అనంతగిరి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం: కొత్తగూడెంకు చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం

సూర్యాపేట, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం తమ్మరబండపాలెం చెరువు సమీపంలో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఇద్దరు యువకులు మృతి చెందారు. గోండ్రియాల గ్రామం వైపు వెళ్తున్న టీఎస్ 29 టీ 7478 నంబర్ గల డీసీఎం వాహనం ఎదురుగా వస్తున్న టీజీ 29 బిబి 2482 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. అనంతగిరి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం డీసీఎం డ్రైవర్ కప్పల వినోద్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని, ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కొత్తగూడెం గ్రామానికి చెందిన భూక్య లీలా ప్రసాద్, భూక్య నవీన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ ప్రమాదంపై భూక్య బాబురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనంతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.